

నేడు జగిత్యాలకు ఎమ్మెల్సీ కవిత రాక

జగిత్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి ఈనెల 15వ తేదీన నిజామాబాద్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత రానున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు ప్రకటించాయి. ఉదయం 11 గంటలకు పట్టణంలోని దరూర్ ఎస్సారెస్పీ కాలువ ఎక్స్ రోడ్డు వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు దరూర్ ఎక్స్ రోడ్డు నుంచి జగిత్యాల కొత్త బస్టాండు వరకు బైక్ ర్యాలీలో పాల్గొని చౌరస్తా వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేయనున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి.

జేఎన్‌టీయూలో గ్రూప్ 2 పరీక్షకు సిద్ధం

కొడిమ్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో ఆదివారం నిర్వహించనున్న టీజీపీఎస్సీ గ్రూప్2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా గ్రూప్ 2 రీజినల్ కోఆర్డీనేటర్ జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. ప్రభాకర్ శనివారం తెలిపారు. జేఎన్ టీయూలోని 3 కేంద్రాలలో 1512 మంది అభ్యర్థులను అలాట్ చేసినట్లు చీఫ్ సూపరిండెంట్లు అసిస్టెంట్



ప్రైవేటు ఆసుపత్రులపై కొరడా

జిల్లా కేంద్రంలో 15 రోజులుగా విస్తృతంగా తనిఖీలు

సోదాలకు డిప్యూటీ డీఎంహెచ్‌వోల నేతృత్వంలో ప్రత్యేక బృందాలు

ఇప్పటికే సుమారు 150 ఆసుపత్రుల తనిఖీ

నిబంధనలను పాటించని కొన్నింటికి షోకాజ్ నోటీసులు

జగిత్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా కేంద్రంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వోల సారథ్యంలో సుమారు అయిదు బృందాలు ఎక్కడికక్కడ సోదాలు చేస్తున్నాయి. నిబంధనలకు నీళ్లొదిలి ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న ఆసుపత్రులపై కొరడా ఝుళిపిస్తోంది. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ (రిజిస్ట్రేషన్-రెగ్యులేషన్) యాక్ట్, 2010 ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులపై తనిఖీలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు జరిగిన తనిఖీల్లో కొన్ని ఆసుపత్రుల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవు. కొన్ని రిజిస్టర్డ్ డాక్టర్లు లేరని తెలిసింది. ఈ నేపథ్యంలో తమను కాపాడాలంటూ ప్రభుత్వ పెద్దలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు చుట్టూ ఆసుపత్రుల యాజమానులు తిరుగుతున్నారు. తనిఖీల్లో నిబంధనలు పట్టించుకోని ఆసుపత్రులను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అనధికారిక క్లినిక్‌లు నడుపుతూ, ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇంజెక్షన్లు ఇస్తున్న రిజిస్టర్ కాని ప్రైవేటు ప్రాక్టిషనర్లపై ఏ మాత్రం దాడులు జరగడం లేదని ప్రైవేటు ఆసుపత్రి వర్గాలు మండిపడుతున్నాయి.

జిల్లాలో 260కి పైగా ప్రైవేటు ఆసుపత్రులు

జిల్లాలో పలువురు వ్యాపారులు వైద్య రంగాన్ని వ్యాపార రంగంగా మార్చేస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ తదితర పట్టణాలతో పాటు పలు ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ పేర్లతో ప్రైవేటు ఆసుపత్రులు వెలిశాయి. జిల్లా కేంద్రంలో సుమారు 170 వరకు ఆసుపత్రులుండగా ప్రధాన పట్టణాల్లో మండల కేంద్రాల్లో మరో 90 వరకు ఆసుపత్రులున్నాయి.

మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 260 ఆసుపత్రులున్నాయి. పలు ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం, మరికొన్ని ఆసుపత్రుల్లో సౌకర్యాలున్నా నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బంది ఉండడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో ఇరవై నాలుగు గంటలు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారనే బోర్డులను ఏర్పాటు చేస్తున్నప్పటికీ సంబంధిత వైద్యులు ఉండడం లేదు. విజిట్ డాక్టర్లు, ఎలాంటి స్పెషలైజేషన్ లేకుండా కేవలం ఎంబీబీఎస్ పూర్తి చేసిన డ్యూటీ డాక్టర్లతోనే వైద్యం అందిస్తున్నారు.

(తరువాయి 8వ పేజీలో)

విద్యార్థుల సంక్షేమంపై సీఎం ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెసిడెన్షియల్ విద్యార్థుల సంక్షేమంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్ డిగ్రీ కళాశాలలో న్యూ కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. విద్య, వైద్యం, ఆహారం ఎలా అందుతుందో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రెసిడెన్షియల్ విద్యార్థులకు కాస్మోటిక్, డైట్ చార్జీలను పెంచామన్నారు. నిరుపేద వర్గాలకు మంచి విద్యా బోధన నేర్పించాలన్న లక్ష్యంతో జగిత్యాలలో రెసిడెన్షియల్ ఉమెన్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. కళాశాలకు శాశ్వత భవన నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. ఆర్డీవో మధుసూదన్, కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలని కార్మికుల నిరసన

కథలాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెడుతున్న వంట కార్మికులు తమకు రావాల్సిన డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కథలాపూర్‌లో నిరసన వెలిబుచ్చుతున్నారు. పాఠశాలల్లో నామమాత్రపు కమీషన్‌తో వంటలు చేస్తున్నప్పటికీ తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. మూడు మాసాలు గడిచినా డబ్బులు విడుదల చేయకపోవడ వల్ల అప్పుల పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వం స్పందించే దాకా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని సీఐటీయు జిల్లా కార్యదర్శి చెన్నవేని దశరథం పేర్కొన్నారు.

టీపీసీసీ డెలిగేట్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్ నూతన కమిటీ

రాయికల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల యూత్ కాంగ్రెస్ నూతన కమిటీ శనివార టీపీసీసీ డెలిగేట్ కాంగ్రెస్ నాయకుడు సుజిత్ రావును మెట్‌పల్లిలోని వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలో పేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల అధ్యక్షుడు అబ్దుల్ మసూద్, జక్కుల సాగర్, గుమ్మడి సంతోష్, మండల జనరల్ సెక్రటరీ మహేష్, సుధాకర్, ప్రవళిక, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాకేష్ నాయక్, జిల్లా జనరల్ సెక్రటరీ మహ్మద్ షాకీర్, బొడ్డు గంగాధర్, అసెంబ్లీ నియోజకవర్గ వైస్ ప్రెసిడెట్ బాపుర సంజీవ్, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ బోదాసు జలపతి, జాఫర్, ఇమ్మాన్, ఆషాం పాల్గొన్నారు.

రాజ్యాంగ ప్రతిమ, గోడ పోస్టర్లు ఆవిష్కరణ

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డిఎస్పీ కార్యాలయంలో శనివారం మెట్‌పల్లి డిఎస్పీ రాములు రాజ్యాంగ ప్రతిమను, గోడ పోస్టర్లను ఆవిష్కరించారు. సుఖీభవ ఆర్గనేజేషన్ వ్యవస్థాపకులు బొక్కెనపల్లి నాగరాజు ఆధ్వర్యంలో రాజ్యాంగ హక్కులపై ప్రచారన్ని చేస్తు ఏర్పాటు చేసిన గోడ పోస్టర్లను మెట్‌పల్లి డిఎస్పీ రాములును కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల లక్ష్మణ్, జడల ప్రభాకర్, గట్టయ్య, స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మెనూతో విద్యార్థులకు మేలు

కలెక్టర్ సత్యప్రాద్

గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభం

8



పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థులతో భోజనం చేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

స్నేహితుడని నమ్మితే నట్టేట ముంచాడు

15 మంది క్రెడిట్ కార్డులు స్వైప్ చేసి ఉడాయించిన యువకుడు

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

7



నిందితుడి ఇంటి ఎదుట బైఠాయించిన బాధితులు

నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ మహాత్మజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను శనివారం సందర్శించారు. విద్యాబోధన, వసతి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం పెంచిన మెస్‌చార్జీలకు అనుగుణంగా తయారు చేసిన నూతన మెనూను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వం నేటి నుంచి నూతన డైట్‌మెస్ చార్జీలు పెంచిందన్నారు. ఖచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేష్, ప్రిన్సిపల్ చైతన్య, మాజీసర్పంచులు జాన్, గంగన్న, నారాయణ, నాయకులు ఇంద్రయ్య, రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి చంద్రారెడ్డి, ప్రభాత్‌సింగ్, ఠాగూర్, ఆరీఫ్, రాజేష్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కోసం పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు: మాజీ మంత్రి కొప్పుల



మాట్లాడతున్న కొప్పుల ఈశ్వర్, పక్కన కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎల్ రమణ, దావ వసంత

జగిత్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్ఆర్ఎస్పీ క్యాంపులో గల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జగిత్యాల పట్టణానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పనిచేసిన కార్యకర్తలకే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం లభిస్తుందన్నారు. అన్ని వర్గాలతో సమన్వయ కమిటీ సమావేశం వార్డుల వారీగా నిర్వహించుకొని పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, పార్టీ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, ప్రధాన కార్యదర్శి అల్లాల ఆనంద్ రావు, కౌన్సిలర్లు దేవేందర్ నాయక్, అవారి శివకేసరి బాబు, సమిండ్ల వాణి శ్రీనివాస్, వొళ్లం మల్లేశం మాజీ ఏఎంసీ ఛైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్, నాయకులు ప్రతాప్, భగవాన్, వొల్లాల గంగాధర్, నక్క గంగాధర్, మైనారిటీ నాయకులు అమీన్, రహమన్ పాల్గొన్నారు.

నేడు ఉచిత అబాకస్ శిక్షణ

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గణితంపై ఆసక్తి ఉన్న వారికి ఈ నెల 15 ఆదివారం రోజున పట్టణంలోని స్థానిక పొన్నాల గార్డెన్‌లో అడ్లగట్ల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత టీచర్ అబాకస్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గంగాధర్ తెలిపారు. ఈ శిక్షణ కార్రక్రమంలో భాగంగా 21ఏళ్లు పైబడిన యువతీ, యువకులకు ఉపాధ్యాయులు, గణితంపై ఆసక్తిగల వారికి ఈ ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించే ఈ వర్క్‌షాప్‌లో గణిత నైపుణ్యాలను మెరుగుపర్చేలా శిక్షణ ఉంటుందన్నారు. పాల్గొనే వారు పేరు, ఆధార్‌కార్డు ఫోటోను 9440444956 వాట్సాప్ నెంబర్‌కు పంపించాలని కోరారు.

బీఆర్ఎస్ హయాంలో విద్యార్థులపై నిర్లక్ష్యం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకుల పాఠశాలల విద్యార్థులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన సందర్భంగా ధర్మపురిలోని మహాత్మా జ్యోతి బాపులే డిగ్రీ కళాశాల, మైనార్టీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాల, మండలంలోని మగ్గిడి సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో శనివారం ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, సంబంధిత శాఖ మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలల్లో 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ 1330, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ 1540, ఇంటర్ నుంచి పీజీ వరకు గల విద్యార్థులకు రూ 2100 వరకు డైట్ చార్జీలు పెంచినట్లు ఆయన తెలిపారు.

అదేవిధంగా కాస్మొటిక్ చార్జీలను కూడ భారీగా పెంచామని, గత ప్రభుత్వం గురుకుల పాఠశాల విద్యార్థులను ఏనాడు పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగనీయ రాదని డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచినట్లు వివరించారు. విద్యార్థులతో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలకు సంబంధించిన కొన్ని సమస్యలను తన దృష్టికి తీసుక వచ్చినట్లు ఆయన తెలిపారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. అంతకు ముందు మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో మెనూ హ్యాండ్ బుక్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, బాలుర, బాలికల వసతి గృహాల్లో కూడ అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీసీవో మనోజ్ కుమార్, రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ ధర్మపురి ఏఎంసీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, కౌన్సిలర్లు నాగలక్ష్మి- రాజేష్, పద్మ-రవీందర్, అరుణ-రమేష్, సంతోషి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్ పాల్గొన్నారు



మైనార్టీ పాఠశాలలో మెనూ హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

రాజీ మార్గమే రాజ మార్గం

సీనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగేశ్వరరావు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) : రాజీ మార్గమే రాజ మార్గమని మెట్‌పల్లి సీనియర్ సివిల్ కోర్టు జడ్జీ నాగేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్ కేసులను కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వార పరిష్కారించుకోవాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంక్ కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ అరుణ్ కుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, పిపి ప్రణయ్, డిఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి, కమిటీ సభ్యులు వెంకటస్వామి, శంకర్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జీ నాగేశ్వరరావు

లోక్ అదాలత్‌లో 1896 కేసుల పరిష్కారం

జగిత్యాల అర్బన్, (ఆంధ్రజ్యోతి) జగిత్యాల కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 1896 కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా న్యాయ సేవా సంస్థ అధికారులు తెలిపారు. ఇందులో 423 క్రిమినల్, 1101 డ్రంక్ అండ్ డ్రైవ్, 372 బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగిన కేసులు పరిష్కారం అయినట్లు న్యాయ సేవా సంస్థ అధికారులు తెలిపారు. అనంతరం జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నీలిమ రాజీ పడిన వారికి ఇన్సురెన్స్ కంపెనీల ద్వారా వచ్చే పరిహారాన్ని అందజేశారు.

ధర్మపురి కోర్టులో లోక్ అదాలత్

ధర్మపురి, (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకుని ధర్మపురి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ అధ్యక్షతన శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు సిబ్బంది, పోలీసులు కక్షిదారుల మధ్య రాజీ కుదుర్చి పలు కేసులు పరిష్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షులు రౌతు రాజేష్, గౌరవ అధ్యక్షులు గడ్డం సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రామడుగు రాజేష్, గూడ జితేందర్, ఇమ్మడి శ్రీనివాస్, ఓరుగంటి చంద్రశేఖర్, జాజాల రమేష్, అలుక వినోద్, కస్తూరి శరత్, సుంకె రాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు

మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదేశం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్‌లో పనులు కాంట్రాక్ట్ తీసుకుని నిర్లక్ష్యం చేసే కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మున్సిపల్ కమిషనర్ చిరంజీవిని ఆదేశించారు. శనివారం పట్టణంలలోని 31వ వార్డులో 10 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అడువాల జ్యోతి, వైస్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ ఛైర్మన్ గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● పట్టణంలోని 23వ వార్డుకు చెందిన చింత గంగాధర్‌కు మంజూరైన 60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందించారు.

● ఇటీవల ఎంపికయిన టీఎన్‌జీవో కార్యవర్గం శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

తపస్ జిల్లా అధ్యక్షుడు భోనగిరి దేవయ్య



మాట్లాడుతున్న తపస్ అధ్యక్షుడు దేవయ్య

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సర్వశిక్ష అభియాన్‌లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు భోనగిరి దేవయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి తమ సంఘ పక్షాన మద్దతు ప్రకటించారు. ఉద్యోగులకు కనీస వేతన స్కేలు మంజూరు చేయడంతో పాటు, న్యాయ బద్ధమైన డిమాండ్‌లు నెర వేర్చాలన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు బోయినిపెల్లి ప్రసాద్‌రావు, అయిల్నేని నరేందర్‌రావు, వొడ్నాల రాజశేఖర్, గంగారెడ్డి, శ్రీధర్ సమగ్ర శిక్ష ఉద్యోగులున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే క్రమబద్ధీకరించాలని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్ డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట సీపీఎస్ సంఘ బాధ్యులు జనార్ధన్, శ్రీనివాస్, వంశీ, కిరణ్, రమేష్ తదితరులున్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ

పెగడపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం అయ్యప్ప పడిపూజ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన బోయినిపల్లి కిషన్‌రావు కుటుంబ సభ్యులు అయ్యప్ప దీక్షాపరులతో కలసి పడిపూజ ఘనంగా నిర్వమించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు, దీక్షాపరులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, గురుస్వాములు తోట రాజు, లెంకలపల్లి తిరుపతి, సూర్యం పాల్గొన్నారు.

క్రైం కార్నర్

శాంతిభద్రతలకు ఆటంకం.. ఇద్దరి అరెస్టు

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన గంభీరావుపేట మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కి చెందిన శివరాత్రి లక్ష్మణ్, చల్ల సతీష్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నవంబరు 24న చల్ల రమేశ్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ప్రమాదానికి కారణమైన వారి నుంచి పరిహారం ఇప్పించాలని అదేరోజు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద రహదారిపై రాస్తారోకోతో ప్రజలకు ఇబ్బందులు కల్పించిన చల్ల బాలరాజు, చల్ల సతీష్, శివరాత్రి లక్ష్మన్, శివరాత్రి నరసవ్వ, శివరాత్రి భాగ్య శివరాత్రి సంతోష్, సంపంగి మల్లవ్వ, కొమ్మరాజు ఐలయ్యతోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశారు. వారిలో ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ తెలిపారు. విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని రోడ్ల మీదకు వచ్చి సామాన్య ప్రజలకు, శాంతి భద్రతలకు ఇబ్బందులు కలిగించేవారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


గొల్లపల్లి మధు(ఫైల్)

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు గ్రామానికి చెందిన గొల్లపల్లి మధు(42) గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వివాహమై సంవత్సరాలు గడుస్తున్నా సంతానం లేదనే బాధతో మానసికంగా కుంగిపోయిన మధు తాగుడుకు బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగి ఆపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు కరీంనగర్‌కు, అక్కడినుంచి వరంగల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు మధు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ తెలిపారు.

బైక్ ఢీకొని బాలికకు తీవ్ర గాయాలు

గన్నేరువరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామంలో బైక్ ఢీకొని బాలిక(4)కు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఖాసింపేట గ్రామానికి చెందిన బొజ్జ మహేందర్, శిరీష దంపతుల కూతురు బొజ్జ దీక్ష(4) తమ అమ్మమ్మ ఊరైన మైలారం గ్రామానికి తన తల్లితో కలిసి శనివారం ఉదయం వెళ్లింది. మధ్యాహ్నం అమ్మమ్మ ఇంటికి సమీపంలోని కిరాణా షాపునకు వెళ్లి తిరిగి వస్తుండగా సాంబయ్యపల్లి గ్రామానికి చెందిన గడ్డం మహేందర్‌రెడ్డి బైక్‌పై వెళ్తూ బాలికను ఢీకొట్టాడు. దీంతో దీక్ష తలకు, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు, బాలుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు చిన్నారికి గాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామానికి చెందిన దంపతులు బానోతు ప్రకాష్, కవిత వారి రెండేళ్ల కొడుకు శివతో ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపునకు వెళ్తున్నాడు. కామారెడ్డి వైపు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలోకి వెళ్తున్న క్రమంలో ఢీ కొన్నాయి. ప్రమాదంలో బానోతు ప్రకాష్, కవిత వారి రెండేళ్ల కొడుకు శివకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

మెడికల్ కళాశాలకు వృద్ధురాలి పార్థివదేహం

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)కు ఈశ్వరకృప వృద్ధాశ్రమం ప్రతినిధులు వృద్ధురాలి పార్థివదేహాన్ని దానం చేశారు. వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధుల ఆశ్రమంలో 11నెలలుగా కంటిచూపు లేకుండా బాధపడుతున్న ఎన్నాడి లక్ష్మి(78) అనే వృద్ధురాలు శనివారం మృతి చెందింది. ఆశ్రమ నిర్వాహకుడు పీటీ స్వామి సిమ్స్ కళాశాలలోని అనాటమి డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పనకు లక్ష్మి పార్థివదేహాన్ని అప్పగించారు. అనంతరం విద్యార్థులు, ప్రొఫెసర్లు మృతదేహానికి గౌరవ వందనం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సాన రామకృష్ణారెడ్డి, కేఎస్‌వాసు, చంద్రశేఖర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, రాంచందర్‌రావు, వెంకటయ్య ఉన్నారు.

విదేశాలకు పంపిస్తానని మోసం: వ్యక్తి అరెస్ట్

తంగళ్లపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు పంపిస్తానని మోసగించిన తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన ఎండీ మహెబూబ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం సిద్ధిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామానికి చెందిన పెద్దపల్లి విజయ్‌కుమార్ అనే వ్యక్తిని విదేశాలకు పంపిస్తానని మోసగించి లక్ష రూపాయలు వసూలు చేసి తప్పుడు వీసాపై పంపించాడు. ఈ విషయంపై విజయ్‌కుమార్ తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మోసగించిన మోహబూబ్‌ను శనివారం ఆరెస్ట్ చేసినట్లు తెలిపారు.

వలస కార్మికుడి ఆత్మహత్య

జ్యోతినగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు దీపక్ కుమార్‌యాదవ్(20) అనే వలస కార్మికుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఇంటికి సమీపంలోని చెట్టుకు టవల్‌తో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీపక్‌కుమార్ ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కాలనీవాసులు అనుమానిస్తున్నారు. ఎన్టీపీసీ పోలీసులు ఆత్మహత్య ఘటనపై విచారణ చేపట్టారు. మృతుడి సంబంధీకులు ఎవరూ స్థానికంగా లేకపోవడంతో ఇప్పటివరకు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఊరి కోసం మన నేతలు



గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కోనరావుపేట మండల నేతలు తమదైన ముద్ర వేశారు. రాజకీయంగా కీలక పదవులు చేపట్టి ప్రజాప్రతినిధులుగా రాణిస్తూ సేవా కార్యక్రమాల్లో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. - కోనరావుపేట

- రాజకీయాల్లో కీలక పదవులు
- సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ముద్ర

■ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారంలో పుట్టి పెరిగిన చెన్నమనేని రాజేశ్వరరావు గతంలో కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆయన కుమారుడు చెన్నమనేని రమేష్ బాబు జర్మనీకి చెందిన సేవ్ స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్‌గా ఉంటూ ఆ సంస్థ ద్వారా వేములవాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు, వాటర్ ట్యాంకులు, పైపులైన్లు ఏర్పాటు చేయించారు. అనంతరం వేములవాడ నియోజకవర్గం నుంచి సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేశారు.

■ ఇదే కుటుంబంలో దివంగత ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావు తమ్ముడు చెన్నమనేని విద్యాసాగర్‌రావు బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా, కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలు అందించారు. పుట్టి పెరిగిన నాగారం గ్రామంలో యువకుల ఉపాధి కోసం ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రాన్ని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా యువకులకు ఉపాధి కల్పిస్తున్నారు. నాగారం గ్రామంలోని గుట్టపైన ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు భారీ ఆంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా శ్రీరామచంద్రస్వామి ఆలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం తన కుమారుడు చెన్నమనేని వికాస్‌రావును ప్రజలకు పరిచయం చేస్తూ బీజేపీలో చేర్పించారు ప్రస్తుతం బీజేపీ వేములవాడ నియోజవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. బీజేపీలోకి రాకముందే ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. వేములవాడ నియోజకవర్గంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 108 అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.

■ మల్కాపేట గ్రామంలో పుట్టి పెరిగిన చల్మెడ ఆనందరావు సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలిచి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న ఆయన పుట్టి పెరిగిన గ్రామానికి ఏదో చేయాలని తపనతో కుటుంబ సభ్యుల సహకారంతో ఆరు కోట్లతో శ్రీరామచంద్రస్వామి ఆలయం, మూడు కోట్లతో విద్యాలయాన్ని నిర్మించారు. ఆయన కుమారుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు, కరీంనగర్ చల్మెడ ఆసుపత్రి చైర్మన్ కొనసాగతుఉన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. లక్ష్మీనరసింహారావు వేములవాడ నియోజకవర్గంలో పేదల కోసం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.




మల్కాపేటలో చల్మెడ లక్ష్మీనర్సింహారావు తండ్రి ఆనందరావు సహకారంతో రూ. 2 కోట్లతో నిర్మించిన ఆధునిక పాఠశాల



నాగారంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రోత్సాహంతో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం



చెన్నమనేని రమేశ్‌బాబు ఆధ్వర్యంలో మంగళపల్లిలో మొదటిసారిగా సేవ్ స్వచ్ఛంద సంస్థ నిర్మించిన వాటర్ ట్యాంక్

రాష్ట్ర స్థాయి నృత్య ప్రదర్శన పోటీల్లో ప్రతిభ


బహుమతి అందుకుంటున్న నిత్యశ్రీ

జగిత్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య ప్రదర్శన పోటీల్లో జగిత్యాల పట్టణానికి చెందిన మహదేవుని నిత్యశ్రీ, వింజమూరి శ్రీకృతి అనే చిన్నారులు ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. హైద్రాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గల ఎన్‌టీఆర్ కళామందిరంలో ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ 15వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ స్థాయి నృత్య, పద్యనాటక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన కూచిపూడి నృత్య పోటీల్లో జగిత్యాలకు చెందిన ఇరువురు చిన్నారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. చిన్నారులు మహదేవుని నిత్యశ్రీ, వింజమూరి శ్రీకృతిలకు నిర్వాహకులు పరమేశ్వర్ బహుమతులు అందించారు. కాగా ప్రతిభ కనబరిచిన చిన్నారులను ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, జగిత్యాల మోదిని లలిత కళాక్షేత్రం నాట్యాచార్యులు బొమ్మిడి నరేశ్ తదితరులు అభినందించారు.

ప్రమాదకరంగా ఎండిన వృక్షం

- భయపడుతున్న వాహనదారులు


సుద్దాల ప్రధాన రహదారి కూడలి వద్ద ఎండిన వృక్షం

కోనరావుపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారి ప్రధాన కూడలిలో రోడ్డుపై ఎండిన వృక్షం ప్రమాదకరంగా మారింది. దీంతో వాహన దారులు, గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని ప్రధాన రహదారి ప్రధాన కూడలిలో హరితహారం కార్యక్రమంలో భాగంగా పెట్టిన చెట్టు వృక్షంగా మారి ఎండిపోయింది. దీంతో ఎండిన వృక్షం తొలగించకపోవడంతో రోడ్డుపై ఎప్పుడు పడిపోతోందని వాహనదారులు, గ్రామస్థులు భయపడుతున్నారు. వృక్షం పడిపోయి ప్రమాదం జరగకముందే తొలగించాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

మల్లాపూర్, డిసెంబరు, 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై కిరణ్‌తో పాటు సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో మల్లాపూర్ మండలంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని టీఎస్ 18టీ 5471 నంబరు గల వాహనంలో తరలిస్తుండగా వేంపల్లి గ్రామంలో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించి వారి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమాజ విలువలు పెంపొందించేందుకే కవితలు

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ


సంపుటిని ఆవిష్కరిస్తున్న సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజ విలువలు పెంపొందించేందుకు కవితల సారాంశం ఎంతగానో ఉపయోగపడుతుందని సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెరంబదూర్ లింబగిరిస్వామి రచించిన 'నిశ్శబ్ద యుద్ధం' కవితా సంపుటిని శనివారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన ఆవిష్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వల చేసి సభ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల బాధలు, వారికి జరిగే అన్యాయాలు, దోపిడీ అణిచివేతలను ఎదుర్కొని సమాజ విలువలు పెంపొందించే విధంగా నిశ్శబ్ద యుద్ధం కవితా సంపుటిలో అక్షరబద్ధం చేశారన్నారు. ప్రతీ హృదయంలో సాహిత్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

అనంతరం సుద్దాల అశోక్‌తేజను కవులు, అభిమానులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి, నాట్యాచార్యులు తిరుక్కోవెల లక్ష్మణస్వామి, గంద్ర ఆనం దరావు, దురిశెట్టి మనోహర్, సత్యనారాయణ, బాలె శివాజీ, శరత్‌చంద్ర, కేశవస్వామి, శ్రీనివాస్ స్వామి, ఉపాధ్యాయులు, కవులు, శ్రోతలు, అభిమానులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన అఖిల్, మధు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దక్షణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఈసరి అఖిల్ (చీర్లవంచ), సిరిపురం మధు (రుద్రంగి) శాతవాహన యూనివర్సిటీ నుంచి ఎంపికయ్యారు. ఈ నెల 18 నుంచి 22 వరకు ఐదు రోజులపాటు కేరళలోని తిరువనంతపురంలో జరిగే దక్షణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల టోర్నమెంట్‌లో శాతవాహన యూనివర్సిటీ నుంచి అఖిల్, మధు పాల్గొననున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన అఖిల్, రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మధు సిరిసిల్ల వీబీఏలో వాలీబాల్ శిక్షణ పొంది పలు టోర్నమెంట్లలో ప్రతిభ చాటాడు. గతంలో అఖిల్ జూనియర్స్ సీనియర్స్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టులో స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మధు ఎస్‌జీఎఫ్, జూనియర్స్ ఉమ్మడి కరీంనగర్ జట్టులో స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాడు.

వేములవాడ అగ్రహారం డిగ్రీ కళాశాలలో చదువుతూ శాతవాహన యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ కనబరిచిన అఖిల్ 2023-24లో మొదటిసారిగా దక్షణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇప్పుడు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ 2024-25లో రెండోసారి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అఖిల్, మధును వీబీఏ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు అభినందించారు.

దంపతులపై దాడి చేసి చోరీ

బీర్‌పూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన కాసం ఈశ్వరయ్య అనే వ్యాపారి ఇంట్లో శనివారం తెల్లవారుజామున నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఈశ్వరయ్య దంపతులపై దాడి చేసి చోరీకి పాల్పడ్డారు. అతని భార్య ఒంటిపై ఉన్న మొత్తం 10 తులాల బంగారు నగలను, 10 తులాల వెండితో పాటు ఇంట్లో ఉన్న 10,000 వరకు నగదు ఎత్తుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. బాధితుడు ఈశ్వరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి తెలిపారు. బాధితుడు ఈశ్వరయ్యను దొంగలు గాయపరచగా జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బేకరిపై మున్సిపల్ అధికారుల దాడులు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ ఔట్ గేట్ ఎదురుగా ఉన్న బాబాసాయి బేకరిపై శనివారం రాత్రి మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. బేకరిలో బూజు పట్టిన కేకులు విక్రయిస్తున్నారని వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. కుళ్లి పోయిన కోడిగుడ్లు, దుర్వాసనతో ఉన్న కేకులు, బేకరీలో వాడే ఇతర ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బేకరీ యజమానికి నోటీసులు ఇచ్చారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ డీ-86 ప్రధాన కాలువ

- కూలిన డ్రాప్‌లు.. కాలువకు గండ్లు
- నిధులు మంజూరైనా మరమ్మతు కరువు

ఎలిగేడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు వరప్రదాయినిగా నిలిచిన శ్రీరాంసాగర్ ఆయకట్టు నీటిని అందించే డీ-86 ప్రధానకాలువ శిథిలావస్థకు చేరుకుంది. కాలువ మరమ్మ తులకు 49.80లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసినా పనులను చేపట్టేందుకు టెండర్లు పూర్తి కాలేదు. దీంతో చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీరు అందే పరిస్థితి కనబడడంలేదని రైతులు వాపోతున్నారు.

డీ-86 ప్రధాన కాలువద్వారా పెద్దపల్లి నియోజకవర్గంలోని ఎలిగేడు, సుల్తానాబాద్, జూలపల్లి, ఓదెల, శ్రీరాంపూర్ మండలాల్లోని వేలాది ఎకరాల భూముల్లో పండే పంటలకు సాగునీరు అందిస్తోంది. ఈప్రాంత రైతులు ఎస్సారెస్పీ నీటిని ఆధారం చేసుకొని అధికశాతం వరిపంటను సాగు చేస్తున్నారు. సాగునీటిని అందించే ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరుకొని రెండు దశాబ్దాలు దాటినప్పటికీ మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

డీ-86 ప్రధాన కాలువపై ఉన్న డ్రాప్‌లు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి, ఉపకాలువలకు వెళ్లే తూములు కూలిపోతు న్నాయి. మరోవైపు కాలువకు ఇరువైపులా గండ్లు పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. అలాగే ఉపకాలువలు, పంట కాలువలు పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయి. దీంతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ కాలువల పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న యాసంగి పంటలకు వారబందీ పద్ధతిలో సరఫరా చేస్తే పంటలకు అరకొరగా అందే అవకాశం ఉండదని రైతులు వాపోతున్నారు. లాలపల్లి, ఎదురుగట నుంచి శివపల్లి వరకు డీ-86 ప్రధాన కాలువపై పెద్ద డ్రాపులు కూలిపోగా మరికొన్ని చోట్ల లోతైన మట్టి బుంగలు ఏర్పడ్డాయి. ఎప్పటికైన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వెంటనే కాలువలు, డ్రాపులు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

కాలువల మరమ్మతు చేపట్టాలి


కాసార్ల మహేందర్, రైతు, నారాయణపల్లి

ఎస్సారెస్పీ డీ-86ప్రధాన కాలువపై కూలిపోయిన డ్రాపులు, ఏర్పడిన బుంగల మరమ్మతులను వెంటనే చేపట్టాలి. లేకుంటే యాసంగిలో రైతులకు చివరి పంట భూములకు సాగునీరు అందక ఇబ్బందులు తలెత్తుతాయి.

మరమ్మతులకు నిధులు మంజూరు


- ప్రసాద్, ఎస్సారెస్పీ ఈఈ

లాలపల్లినుంచి శివపల్లి వరకు ఉన్న ఎస్సారెస్పీ డీ-86 ప్రధాన కాలువ మరమ్మతులకు రూ.49.80లక్షలు నిధు లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులను చేపట్టేందుకు టెండర్లు పూర్తి కాలేదు. త్వరగా పనులను చేపట్టేందుకు కృషి చేస్తాం.


శివపల్లిలో కూలిన ఎస్సారెస్పీ కాలువ డ్రాప్


తెగిన డీ-86 ప్రధాన కాలువ


కూలిన తూమ్

ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ

- రెబ్బల్‌దేవ్‌పల్లిలో 40 ఎకరాల్లో నర్సరీ
- ఎనిమిది లక్షల మొక్కల పెంపకం..
- అక్కడినుంచి జిల్లావ్యాప్తంగా పంపిణీ
- ఎస్సీలకు వంద, బీసీలకు తొంభై శాతం సబ్సిడీ
- నాలుగేళ్ల పాటు పెట్టుబడికి సాయం


రెబ్బల్‌దేవ్‌పల్లి నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఆయిల్‌పామ్ మొక్కలు

సుల్తానాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రైతులకు సబ్సిడీ, పెట్టుబడి సాయం రూపంలో ప్రోత్సాహం అందిస్తున్నాయి. మూడేళ్ల క్రితం సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లిలో రాష్ట్ర ఉద్యానవన శాఖ వారి ఆధ్వర్యంలో తిరుమల కంపెనీకి చెందిన వారు ఆయిల్‌పామ్ నర్సరీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ఆయిల్‌పామ్ సాగుపై రైతులను చైతన్యపరిచే కార్యక్రమం చేపట్టారు. గ్రామగ్రామాన అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలను ఆహ్వానించి రైతుల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

48 ఎకరాల్లో నర్సరీ..

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ నర్సరీలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు రెబ్బల్‌దేవ్‌పల్లిలో నర్సరీని ఏర్పాటు చేశారు. గ్రామంలో 48 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలను విదేశాల నుంచి తెప్పించి వాటిని సంరక్షించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి కలిగిన రైతులను గుర్తించి వారిని నర్సరీకి తీసుకువచ్చి తగిన శిక్షణ ఇప్పిస్తున్నారు. రైతుల భూములను గుర్తించి వాటికి నీటి వసతి ఉందా లేదా, ఆయిల్‌పామ్ సాగుకు యోగ్యమైన భూములు అవునా కాదా అని విచారిస్తారు. అవసరమైన చోట భూసార పరీక్షలు చేయించి సాగు కోసం సన్నద్ధం చేయిస్తారు.

మొక్కల సంరక్షణ..

రెబ్బల్‌దేవ్‌పల్లిలో 2021లో ఆయిల్‌పామ్ నర్సరీ ఏర్పాటు చేశారు. ప్రైమరీ నర్సరీలో మొదట మూడు నుంచి నాలుగు నెలల వరకు మొక్కలను పెంచుతారు. అనంతరం ఆ మొక్కలను అక్కడి నుంచి తొలగించి వాటిని ఇరవై కిలోల మట్టి కవర్లలో పెట్టి సెకండరీ నర్సరీకి తరలిస్తారు. అక్కడ 12 నుంచి 14 నెలలు సంరక్షించిన అనంతరం వాటిని రైతులకు పంపిణీకి యోగ్యంగా ఉన్నవా లేవా నిర్ధారిస్తారు. నర్సరీలో సంరక్షించిన ఆయిల్ పామ్ మొక్కలను జిల్లాలోని 14 మండలాలకు చెందిన రైతులకు పంపిణీ చేస్తున్నారు.


నీరుకుళ్లలో ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్న రైతులు(ఫైల్)

పది వేల ఎకరాల్లో సాగు అంచనా..

జిల్లాలో పదివేల ఎకరాల్లో ఆయిల్ పామ్ రైతులతో సాగు చేయించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని అంతర్గాం మండలంలో 80 ఎకరాల్లో, ధర్మారం మండలంలో 314, ఎలిగేడులో 137, జూలపల్లిలో 2016, కమాన్‌పూర్‌లో 105, మంథనిలో 242, ముత్తారంలో 458, ఓదెలలో 162, పాలకుర్తిలో 153, పెద్దపల్లిలో 166, రామగిరిలో 119, రామగుండంలో 61, కాల్వశ్రీరాంపూర్‌లో 151, సుల్తానాబాద్‌లో 252 ఎకరాలతో కలిపి మొత్తం 4416 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీరందరికీ తామే మొక్కలు పంపిణీ చేశామని రెబ్బల్‌దేవ్‌పల్లిలోని నర్సరీ నిర్వాహకులు తెలిపారు.

రైతులకు సబ్సిడీ...

ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తిగల ఎస్సీ రైతులకు వంద, బీసీలకు తొంభై శాతం చొప్పున సబ్సిడీ ఇస్తారు. అలాగే డ్రిప్ కోసం అవసరమైన పెట్టుబడి మొత్తాన్ని అందించి నాలుగేళ్ల అనంతరం వాయిదాల రూపంలో కంపెనీ వారు వసూలు చేసుకుంటారు. ఆయిల్‌పామ్ సాగు చేసే ఒక్కొక్క రైతుకు ఎకరాకు రూ.4200 చొప్పున పెట్టుబడులు చెల్లిస్తారు. ఇలా నాలుగేళ్లకు దాదాపు పదిహేడు వేల రూపాయల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది.

ఎకరాకు రూ.1,140 చెల్లిస్తే చాలు..

- శివ, నర్సరీ మేనేజర్



ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు ఒక్కో మొక్కకు 20 రూపాయల చొప్పున ఎకరా సాగు కోసం 57 మొక్కలకు రూ.1140 చెల్లిస్తే సరిపోతుంది. ఆయిల్ పామ్ పంటలో రైతులు అంతర పంటలు కూడా వేసుకోవచ్చు. నాలుగేళ్లలో మొక్కజొన్న, వేరుశనగ, పత్తితో పాటు కూరగాయలను అంతర పంటగా సాగు చేసుకోవాలి. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు 30 ఏళ్ల వరకు ఆదాయం వస్తుంది.

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్న ఆలయానికి చేరుకుని ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. తెల్లవారు జామున కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో అశోక్, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లు చేశారు.

రాజన్నను దర్శించుకున్న మితాలి మధుస్మిత

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌కామ్‌టాక్స్ ఐఆర్‌ఎస్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాలి మధుస్మిత శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు ఘన స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి


అలంకరణలో స్వామివారు

ధర్మపురి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 8 నుంచి ఆరంభమైన దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా పౌర్ణమి రోజున ఉదయం స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయం పక్కనే గల ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల ఆలయంలో దత్తాత్రేయ స్వామి వారలను అందంగా పూలతో అలకంరించారు. అనంతరం ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్‌శర్మ, ద్యారం గురుప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారలకు రుద్రాభిషేకం, పురుషసూక్తం, విశేష పూజలు జరిపారు. పౌర్ణమి సందర్భంగా లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో అనేక మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గోదావరి నదీ తీరాన గల ఆలయంలో రాత్రి వేళలో మంత్ర జాగరణ, ప్రత్యేక పూజలు, హారతి, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. అలాగే దివ్యదర్శనం, బాల దత్తాత్రి డోలోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, రొట్టె శ్రీనివాస్ పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం పూజలు నిర్వహించారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం శనివారం వేలాది భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, ఇతర పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు

రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో గల ఉప ఆలయం వెంకటేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం నుంచి నెల రోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణరావు తెలిపారు. ఈ సందర్భంగా నిత్యం ఆండాల్ అమ్మవారికి పంచామృత అభిషేకం, తిరుప్పావై అనుసంధానం, పొంగలి నివేదన, భజన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఇందులో భాగంగా జనవరి 10న వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వారా దర్శనం, 13న గోదా రంగనాథ కళ్యాణ ఉత్సవాలు జరుగుతాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ ఉత్సవాలలో పాల్గొనాలని కోరారు

ఉమ్మడి జిల్లా షూటింగ్ బాల్ పోటీలకు స్పందన


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా యునైటెడ్ షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని సప్తగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి 160 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభచాటారు. ఈ పోటీల్లో విశేష ప్రతిభచాటిన క్రీడాకా రులను ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఈ పోటీలను ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఆరిఫ్ పాష, మహ్మద్ ముఫాజిల్ అహ్మద్ పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యా యులు, ఆశాలు కుమార్, నాగరాజు, సీనియర్ క్రీడాకారులు ఆదిత్య, నరేశ్, వంశీ, అద్నాన్, సబిక్ పాల్గొన్నారు.

స్నేహితుడని నమ్మితే నట్టేట ముంచాడు

- 15 మంది క్రెడిట్ కార్డులు స్వైప్ చేసి ఉడాయించిన యువకుడు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడని నమ్మిన వ్యక్తి కుటుంబ సభ్యులు అనారోగ్యంతో ఉన్నారని చెప్పి ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద క్రెడిట్ కార్డులు తీసుకుని 40 లక్షలతో ఉడాయించాడు. ఈ సంఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో జరగగా బాధితులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జామ్‌బాగ్‌కు చెందిన కల్లెం యశ్వంత్ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన తల్లి, భార్య అనారోగ్యం పేరు చెప్పి ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద 15 మంది క్రెడిట్ కార్డులు తీసుకుని 40 లక్షల రూపాయలు స్వైప్ చేశాడు. ఆ డబ్బులు తీసుకుని ఉడాయించాడు. క్రెడిట్ కార్డులు లేని వారికి క్రెడిట్ కార్డులు ఇప్పించి మరీ మోసగించాడని బాధితులు వాపోయారు. దీంతో బాధితులు శనివారం అతని ఇంటి ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. అనంతరం బాధితులు జగిత్యాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు నెలల నుంచి పరారీలో ఉన్న యశ్వంత్‌ను పట్టుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

ఎయిర్‌ఫోర్స్‌కు సైనిక్ స్కూల్ విద్యార్థి ఎంపిక


సిద్ధార్థ

చొప్పదండి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ విద్యార్థి రామడుగు సిద్ధార్థ ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికయ్యాడు. 12వ తరగతి పూర్తి చేసిన సిద్ధార్థ్ ఎన్డీఏ పరీక్షల్లో ప్రతిభ చాటి ఎయిర్‌ఫోర్స్ వింగ్‌కు ఎంపికయ్యాడు. కాగా సిద్ధార్థ్‌ను గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, సంయుక్త కార్యదర్శి సక్రు నాయక్, జోనల్ ఆఫీసర్ భీమయ్య అభినందించారు. ఈ మేరకు ఎన్డీఏకు ఎంపికకు కృషి చేసిన పాఠశాల డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సి పాల్ కాళహస్తి, సిబ్బందిని సంస్థ కార్యదర్శి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి

గంగాధర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం కురిక్యాలకు చెందిన మాజీ ఎంపీటీసీ నందయ్య(50) శనివారం మధురానగర్ చౌరస్తాకు బైక్‌పై పని నిమిత్తం వెళుతున్నాడు. ఇదే సమ యంలో కొడిమ్యాల మండలానికి ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై కరీంనగర్ వైపు వస్తున్నాడు. మధురానగర్ చౌరస్తాలో రెండు వాహనాలు వేగంగా ఢీకొన్నాయి. కిందపడిన నందయ్యకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు 108లో కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

త్రీడీ ఆర్టిస్టను అభినందించిన గవర్నర్

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్ ఎస్ఎస్ఆర్ కృష్ణను శనివారం గవర్నర్ జిష్ణుదేవ్ అభినందించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి త్రీడీ ఆర్ట్ గురించి వివరించారు. వివిధ దేశాల్లో కృష్ణ గీసిన త్రీడీ చిత్రాలను ఆసక్తిగా గవర్నర్ పరిశీలించి కృష్ణను అభినందించారు. మహాభారత కాలంనాటి ఈ త్రీడీ ఆర్ట్‌ను అభివృద్ధి చేయాలని, రాజ్‌భవన్ స్కూల్‌లో త్రీడీ ఆర్ట్ అవగాహన వర్క్‌షాప్ నిర్వహించాలని గవర్నర్ సూచించారు.

నిఫ్ట్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- మొదలైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు - జనవరి 6 వరకు అవకాశం



మాట్లాడుతున్న ప్రొఫెసర్లు అనంతఫణి, రామకృష్ణ, నరేష్‌కుమార్

సుభాష్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని, అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్లు అనంతఫణి, రామకృష్ణ, నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియచేశారు. ఈ కోర్సులో అండర్ గ్రాడ్యుయేట్స్ కోర్సులలో ఫ్యాషన్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, యాక్సెరీ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, లెదర్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ టెక్నాలజీ ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హతతో ఇందులో చేరవ చ్చన్నారు. డిగ్రీ, పీజీ చేసినవారు కూడా ఈ కోర్సులో చేరవచ్చ న్నారు. ఎక్కువగా ఉత్తర భారతదేశానికి చెందిన వారే ఇందులో చేరుతుంటారని, దక్షిణ భారత్‌లో దీనిపై ఎవ రూ దృష్టి పెట్టరని అన్నారు. 2025 విద్యా సంవత్సరానికి నవంబరు 20 నుంచే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారం భమైందని, 6 జనవరి 2025తో గడువు ముగుస్తుందని తెలిపారు. రూ. 5వేల ఫైన్‌తో జనవరి 7 నుంచి 9 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. 9 ఫిబ్రవరి 2025లో ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఉంటుందన్నారు. ఏప్రిల్ చివరిలో ఫలితాలు ప్రకటిస్తారని, జూన్ 2025లో సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా రిజి స్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

గోదావరిఖని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించే బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో కనీస వేతనాల మండలిని నియమించారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టించుకోలేదన్నారు. మళ్లీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేతన మండలి చైర్మన్‌ను నియమించింది కానీ సభ్యులను నియమించకుండా కాలయాపన, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కనీస వేతన సవరణ చట్టానికి అనుగుణంగా జీవోలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలకు మాత్రమే స్థానం కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు నరేష్, అశోక్, చిలుక శంకర్, దుర్గయ్య, రవికుమార్, సాంబయ్య, ప్రవీణ్‌కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐ కృష్ణ

ఎంసీహెచ్‌లో శిశువు మృతి

- అట్ట డబ్బాలో పెట్టి తండ్రికి అప్పగించిన సిబ్బంది -ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న తల్లి, బంధువులు, (ఇన్‌సెట్‌లో శిశువును అట్ట డబ్బాలో పెట్టి ఇచ్చిన సిబ్బంది)

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మాతా శిశు కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. పుట్టినప్పుడు ఆరోగ్యంగా ఉన్న శిశువు రెండు రోజుల తర్వాత అకస్మాత్తుగా మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతో తన కుమారుడు మృతి చెందాడని శిశువు తండ్రి ఆరోపిస్తున్నాడు. ఆలస్యంగా ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నగునూర్ లచ్చక్కపేటకు చెందిన కిషోర్-శ్రీలతలకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మూడో సంతానంగా జగిత్యాలలోని మాతా శిశు కేంద్రంలో ఈనెల 10వ తేదీ మంగళవారం కుమారుడు జన్మించాడు. శిశువు పుట్టిన తర్వాత పరీక్షించిన వైద్యులు ఆరోగ్యంగా ఉన్నాడని చెప్పడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భార్య వద్ద తన బంధువును ఉంచిన కిషోర్ పనికోసం బయటకు వెళ్లాడు. గురువారం సాయంత్రం ఆస్పత్రి నుంచి బాబు సీరియస్‌గా ఉన్నాడంటూ కిషోర్‌కు ఫోన్ రావడంతో హడావిడిగా మాతా శిశు కేంద్రానికి చేరుకున్నాడు. ఆయనకు బాబు మృతి చెందాడని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న బాబు ఎలా మృతి చెందాడని ప్రశ్నిస్తే వైద్యులు ఒక్కొక్కరు ఒక్కోరకమైన సమాధానం చెప్పారని కిశోర్ ఆరోపిస్తున్నాడు. బాబుకు ఆస్పత్రి సిబ్బంది వ్యాక్సిన్ ఇచ్చారని, వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాతనే మృతి చెందాడని అతను ఆరోపిస్తున్నారు. మృత శిశువును తన చేతికి అప్పగించారని, తర్వాత కాటన్ డబ్బాలో శిశువును పెట్టి హడావిడిగా అక్కడి నుంచి పంపించారని ఆరోపించాడు. శిశువు మృతి చెందిన విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములను వివరణ కోరగా బాబు ఆరోగ్యంగా జన్మించాడని, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, పాలు సరిగా పట్టకపోవడం వల్ల పాలు ముక్కులోకి వెళ్లి శ్వాస అందక మృతి చెందాడని ఆయన వివరణ ఇచ్చారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ


రాజన్న ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న నిర్వాహకులు, అర్చకులు


కోరుట్లలో కర్పూర హారతులు అందిస్తున్న స్వాములు

కోరుట్ల రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెం గ్రామంలోని సంగమేశ్వర ఆలయంలో శనివారం అయ్యప్ప పడి పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వేదపండితుడు పాలెపు రామకృష్ణ శర్మ మంత్రోచ్ఛారణల మధ్య పడి పూజ మహోత్సవం నిర్వహించారు. గురుస్వామి సుద వేణి భూమయ్య ఆధ్వర్యంలో 18వ సారీ దీక్ష భూనిన శంకర్ పడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

- వైభవంగా ఆరట్టు ఉత్సవం

వేములవాడ కల్చరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ అయ్యప్ప ఆలయంలో శనివారం ఆరట్టు ఉత్స వాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు రాజరాజేశ్వ రస్వామి ఆలయంలోని ధర్మగుండంలో చక్రస్నానం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 6.30 గంటలకు ఆలయంలో పడిపూజ నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొండ దేవయ్యపాల్గొన్నారు.

- ఆరట్టు ఉత్సవంలో ప్రభుత్వ విప్

వేములవాడ మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన ఆరట్టు ఉత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా క్రాస్ కంట్రీ పోటీలు ప్రారంభం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శనివారం జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ముత్తయ్య రెడ్డి మాట్లాడారు. మారుమూల గ్రామంలో క్రాస్ కంట్రీ పోటీలను నిర్వహించడం వలన జిల్లాలోని విద్యార్థులకు అవగహనతో పాటు ఆలోచన విధానం మారుతుందన్నారు. క్రీడాలలో గెలుపొందిన విద్యార్థులకు వెల్మల రాజరెడ్డి స్మారకర్థం బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మ రెడ్డి, అశోక్, జ్ఞానేశ్వర్, కొమురయ్య, రాందాస్, రవి, రాజేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గొల్లపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా జలేందర్

గొల్లపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ గొల్లపల్లి మండల శాఖ అధ్యక్షుడుగా మండలంలోని ఇస్రాజ్ పల్లె గ్రామానికి చెందిన సీనీయర్ పార్టీ నాయకులు, తాజామాజీ జడ్పీటీసీ గోస్కుల జలేందర్ నియమితులయ్యారు. జలేందర్‌ను నియమిస్తూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పార్టీ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు నియామక ఉత్తర్వులను నూతన అధ్యక్షుడికి అందజేశారు. జలేందర్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ రమణ, జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకులం విద్యార్థులు

మల్యాల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోషియోషన్ ఆద్వర్యంలో నిర్వహించిన అండర్-16 విభాగం 2కె రన్‌లో మండలంలోని తాటిపల్లి బాలికల గురుకులం విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో ప్రతిభ చాటిన కె.మనుస్మిత, ఆర్.మనీషా, ఎస్.రేవతిలను పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు

కొత్త మెనూతో విద్యార్థులకు మేలు

కలెక్టర్ సత్యప్రసాద్


మల్యాల మండలం తాటిపల్లి గురుకులం విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నూతనంగా ప్రవేశ పెట్టిన మెనూతో విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో కలెక్టర్, మేడిపల్లి గ్రామ శివారులోని మైనారిటీ రెసిడెన్షియల్‌లో ప్రభుత్వం శనివారం నూతనంగా ప్రవేశపెట్టిన కామన్ డైట్ మెనూ వారు ప్రారంభించి నంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ముందుగా పెద్దాపూర్ గురుకుల పాఠశాల పరిసరాలను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. మేడిపల్లి గ్రామ శివారులోని మైనారిటీ రెసిడెన్షియల్‌లోని పరిసరాలు, కిచెన్ షేడ్, తరగతి గదులు, మినరల్ వాటర్, వాష్ రూమ్స్‌లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. 2024 సీఎం గెమ్స్‌లో వివిధ పోటీల్లో గెలుచుకున్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై అనిల్, ప్రిన్సిపాల్స్ మాధవిలత, మోహన్, ఉపాధ్యాయులు, అధికారులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకే కామన్ డైట్

మల్యాల: వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకే ప్రభుత్వం కామన్ డైట్ కార్యక్రమం చేపట్టిందని ఇందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి కొత్త డైట్ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని తాటిపల్లి బాలికలు గురుకుల పాఠశా లలో కలెక్టర్ విద్యార్థులతో కలిసి కామన్ డైట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. 40శాతం డైట్ చార్జీలు, 200శాతం కాస్మొటిక్ చార్జీలను ప్రజాప్రభుత్వం పెంచిందని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ మానస ఇతర అధికారులు పాల్గొన్నారు

కోరుట్ల : ప్రభుత్వ నిబంధలను పాటించి విద్యార్థులకు భోజనం అందించాలని కోరుట్ల రెవెన్యూ అధికారి జీవాకర్ రెడ్డి వసతి గృహ నిర్వాహకులకు సూచించారు. శనివారం పట్టణంలోని ఎసీకోని గుట్ల ప్రాతంలోని డిగ్రీ కళాశాల అనుసంధానంగా ఉన్న మహిళ వసతి గృహాన్ని పరిశీలించి ప్రభుత్వం ప్రకటించిన మెనూను ఆవిష్కరించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తహసీల్దార్ కిషన్‌లతో పాటు రెవెన్యూ అధికారులు, వసతి గృహ నిర్వాహకులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహం, ఎస్టీ బాలికల మినీ గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్, ప్రధానోపాధ్యాయులు ప్రియాంక, ప్రజాప్రతినిధులు నారాయణరెడ్డి, జలపతిరెడ్డి, రాజం పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని పూడూర్ గ్రామంలోని బీసీ హాస్టల్‌ను శనివారం తహసీల్దార్ రమేష్ పరిశీలించారు. తహసీల్దార్ కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. వంట గదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆర్ఐ కరుణాకర్, బీసీ వెల్ఫేర్ జూనియర్ సహాయకుడు రాజేష్ ఉన్నారు.

రాయికల్: విద్యార్థులకు డైట్ మెనూ ప్రకారం భోజనం అందించాలని రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. మండలంలో ఒడ్డెలింగాపూర్ మినీ గురుకుల పాఠశాలలో శనివారం నూతన డైట్ ప్లాన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన డైట్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అలాగే సింగరావుపేట గురుకుల పాఠశాలలో నాయబ్ తహసీల్దార్ గణేష్ నూతన డైట్ మెనూను ప్రారంభించారు. పాఠశాలలోని స్టాక్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఎంఈవో శ్రీపతి రాఘవులు, పాల్గొన్నారు.


మేడిపల్లి శివారులోని మైనారిటీ రెసిడెన్షియల్‌లో తయారు చేస్తున్న భోజన పదార్థాలను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్



మెనూను పరిశీలిస్తున్న ఆర్డీవో జీవాకర్ రెడ్డి, పక్కన ఉపాధ్యాయులు

ప్రైవేటు ఆసుపత్రులపై కొరడా..

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేస్తున్న వైద్య అధికారుల తనిఖీ బృందాలు 16 అంశాలతో కూడిన చెక్ లిస్టు ఆధారంగా పరిశీలన జరుపుతున్నాయి. క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆసుపత్రి పేరు, క్లినికల్ ఎ స్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 ప్రకారం రిజిస్టర్ చేసు కున్నారా..లేదా, రిజిస్ట్రేషన్ నంబరు, తేదీ, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను ఆసుపత్రిలో ప్రదర్శిస్తున్నారా.. లేదా.. రిజిస్ట్రేష న్ సర్టిఫికేట్ వాలిడిటీ ఉందా..?ఇలా పలు అంశాలను పరిశీలిస్తున్నారు.

● నిబంధనలు ఇలా..

ఇన్‌పేషంట్ సేవలు అందించే ఆసుపత్రులను ఏర్పాటు చేయాలంటే విశాలమైన భవనాలు, రోగులకు అన్ని రకాల సౌకర్యాలు, ఐసీయూ, జనరల్ వార్డులు, అత్యవసర సేవలందించే ఆసుపత్రుల్లో అధునాత సౌకర్యాలతో వెంటిలేటర్ సౌకర్యం అందుబాటులో ఉండాల్సి ఉంది. సౌకర్యాలకు తగ్గట్టుగానే క్వాలిఫైడ్ డాక్టర్లు, వైద్య సిబ్బంది పనిచేయాలి. పలు ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు సైతం పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఆసుపత్రుల్లో వివిధ ప్రోసీజర్లకు ఎంత బిల్లు వేస్తారనేది ఆయా ఆసుపత్రులు ఆరు బయట ప్రదర్శించాలని నిబంధనలను పలువురు పట్టించుకోవడం లేదు. మూడేళ్లలోపు రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఫార్మాస్యూటికల్ కంపెనీల నుంచి డాక్టర్లు బహుమతులు పొందకూడదని నిబంధనను విస్మరిస్తున్నారు.

● ఇష్టారీతిగా బయోమెడికల్ వేస్ట్ నిర్వహణ..

ప్రైవేటు ఆసుపత్రుల వ్యర్థాలను యథేచ్ఛగా ఎక్కడ పడితే అక్కడ పడేసి పలువురు యజమానులు చేతులు దులుపుకుంటున్నారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ పక్కాగా చేపట్టాల్సిన ఆసుపత్రి యాజమా న్యం నిర్లక్ష్య దోరణితో పలు ప్రాంతాల్లో రహదారుల పక్కన పారేస్తున్నారు. ఆసుపత్రుల్లో వినియోగించిన వ్యర్థాలను ఇష్టారీతిగా పడేస్తున్నారు.

● ఆర్ఎంపీ, పీఎంపీలు, అంబులెన్స్ డ్రైవర్లదే హవా..

జిల్లాలో పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు, అంబులెన్స్ డ్రైవర్లదే హవా కొనసాగుతోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు రోగాలు వచ్చిన సందర్భంగా ఈ ఆసుపత్రుల్లో చేర్పించి జేబులు గుల్ల చేస్తున్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు, అంబులెన్స్ డ్రైవర్లను పలు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు కమిషన్లను అప్పగించి ప్రోత్సహిస్తున్నాయి. ఆసుపత్రికి తీసుకవచ్చే రోగుల తీవ్రతను బట్టి, వైద్యానికి అయ్యే ఖర్చులో సుమారు 10 నుంచి 50 శాతం వరకు కమీషన్లను పలు ఆసుపత్రుల నిర్వాహకులు ముట్టజెప్పుతున్నారు.

● మెడికల్ షాప్‌లు, ల్యాబ్‌ల పేరిట దోపిడి..

పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ల్యాబ్‌లు, మెడికల్ షాప్‌లను ఏర్పాటు చేసి యథేచ్ఛగా దోచుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ల్యాబ్ టెక్నిషియన్లు లేకుండానే ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రూ. వేలల్లో ఫీజులను ల్యాబ్‌ల పేరిట వసూలు చేస్తున్నారు. చాలా ఆసుపత్రుల్లో అటాచ్డ్ మెడికల్స్ నిర్వహిస్తున్నారు. మెడికల్ దుకాణాల్లో ఫార్మసిస్టు లేకుండా మెడిసిన్ విక్రయిస్తున్నారు.

● నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ప్రమోద్ కుమార్, డీఎంహెచ్‌వో

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రయివేటు ఆసుపత్రులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రులను గుర్తించి ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నాము. ఆసుపత్రి నిర్వాహకులు నోటీసులకు ఇచ్చే సమాదానాలు సంతృప్తికరంగా లేకపోతే తదుపరి చర్యలు తీసుకుంటాము.

పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలే కీలకం

● రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి సుభాష్

కథలాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలే గ్రామాల్లో కీలకమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తాండ్ర్యాల, దూలూరు, పోసానిపేట గ్రామా ల్లో బూత్ కమిటీల నియామకం సందర్భంగా హాజరై మాట్లాడారు. బూత్ కమిటీలు కష్టపడి పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలవడానికి అవకాశం ఉందన్నారు. దూలూరులో చందనగిరి రాజేశ్, క్యాతం జలంధర్‌రెడ్డి, మీన్‌రెడ్డి, వేములవాడ వెంకటేశ్, తాండ్ర్యాల, పోసానిపేట గ్రామాల్లో అధ్యక్ష, కార్యదర్శులను నియమించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మల్యాల మారుతి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు నరెడ్ల రవి, జనార్ధన్‌రెడ్డి, గంగాధర్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాష్, ఇతరులు

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం గొల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన 108 మంది బాధిత లబ్ధిదారులకు సీఎంఆర్ ఎఫ్ ప్రొసీడింగ్ పత్రాలను లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎల్లావేళలా నిరుపేదలకు అండగా ఉంటుందని, వారి సంక్షేమం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. అనంతరం మండలంలోని రాపల్లె గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పుర పాటి రాజిరెడ్డి, యూత్ మండల శాఖ అధ్యక్షుడు పురంశెట్టి గౌతమ్ రాజు, పట్టణ శాఖ అధ్యక్షుడు మహేష్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ గౌడ్, పద్మవెంకటేషం, రాజ్యలక్ష్మీతిరుపతి రెడ్డి, ధనవ్వలక్ష్మణ్ పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నాయకులు

విద్య, వైద్య హబ్‌గా జగిత్యాల

పల్లె దవాఖాన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే

సారంగాపూర్, డిసెంబరు, 14 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య రంగాల హబ్ గా జగిత్యాల జిల్లా మారిందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో రూ, 20 లక్షల నిధులతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పల్లె దవాఖాన నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాలలో మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటి ఆసుపత్రికి రాష్ట్రంలోను మొదటి అనుమతి జగిత్యాలకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. నియోజకవర్గానికి 21 పల్లె దవాఖానలు మంజూరు అయ్యాయ ని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఎంపీడీవో గంగాధర్, ఏఈ రాజమల్లయ్య, వైద్యురాలు రాధ, ఆశ వర్కల్లు, సహకార సంఘం చైర్మన్, నర్సింహరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత

మల్యాల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మ్యాడంపల్లికి చెందిన ఘాతం తిరుపతి రెండు రోజుల క్రితం విద్యుధాఘాతంతో మృతి చెందగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. అనంతరం మృతుని కుటుంబానికి రూ.10 వేల సాయం అందించారు. అంతకు ముందు విద్యుదాఘాతంలో దగ్ధం అయిన ఇంటిని పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఆదిరెడ్డి, ముత్యం శంకర్, శనిగారపు తిరుపతి, వీరబత్తిని ప్రతాప్, సంత ప్రకాష్‌రెడ్డి, లక్ష్మన్, నేరెళ్ల సతీష్ రెడ్డి, వంశీధర్, వినయ్, వెంకటేష్, ప్రవీన్, అనిల్, ప్రశాంత్ ఉన్నారు

జైనాలో సహకార సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్

ధర్మపురి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జైనా గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జైనాలో పెట్రోల్ బంక్‌ను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యలను పరిష్కరిస్తానని ఆయన అన్నారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు వ్యవసాయ శాఖ ద్వారా తెప్పించుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, జైనా పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేష్, వైస్‌చైర్మన్ మోహన్‌రెడ్డి, సీఈవో సాగర్‌రావు, పాలకవర్గ సభ్యులు, మండల రైతుబంధు అధ్యక్షులు సౌళ్ల భీమయ్య, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొప్పుల పరామర్శ

ధర్మపురి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నర్సయ్యపల్లె గ్రామంలో ద్యావనపెల్లి రాజన్న ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు నేరెళ్ల తిరుపతి, ఇమ్మడి రాజయ్య పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలం లోని చెగ్యాం, కిషన్‌రావుపేట గ్రామాలలో బాధిత కుటుంబాలను శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. చెగ్యాంలో ఏలేటి తిరుపతి రెడ్డి తల్లి, దనిశెట్టి గణేష్ మృతి చెందగా వారి కటుంబాలను పరామర్శించారు. కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన పిట్టల రాజమొగిలి ఇటీవలే ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, కొమురయ్య, రాజయ్య, సత్యం, కుమార్, సతీష్ పాల్గొన్నారు.

గొల్లపల్లి : గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన సీనీయర్ పాత్రికేయులు కట్ట శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గోస్కుల జలేందర్, తాజామాజీ అధ్యక్షులు బొల్లం రమేష్, సింగిల్‌విండోల ఫోరం జిల్లా చైర్మన్ డా. సుంకిశాని రాజసుమన్ రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ హన్మండ్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

● అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సీఎం రేవంత్‌రెడ్డి అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం పట్టణంలోని పలు కమ్యూనిటీ భవనాలకు, కుల సంఘాల భవన పనులకు, సీసీ డ్రైనేజీ పనులకు ఎస్‌డిఎఫ్ నిధులు మంజూరు కాగ సంబంధిత పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలో ఎస్‌డీఎఫ్ నిధులు 4.64 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మెట్‌పల్లి పట్టణంలో పలు అభివృద్ధి పనులకు 46 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు అనేక పనులకు నిధులు మంజూరు చేసిందన్నారు. ఇది ప్రజా పాలన ప్రభుత్వం అని పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేకనే ప్రతి పక్షాలు రాద్దాంతం చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి విజయ్ అజాద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు లింగారెడ్డి, ఎండి షాకీర్, లక్ష్మణ్, రాజయ్య, హన్మాండ్లు, రాంప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు

జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలకు అల్లీపూర్ క్రీడాకారులు

రాయికల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలకు మండలంలోని అల్లీపూర్ పాఠశాల క్రీడాకారులు ఎంపికయ్యారు. భూపతిపూర్ గ్రామంలో జరిగిన మండల స్థాయి సీఎం కప్ పోటీల్లో అల్లీపూర్ క్రీడాకారులు పాల్గొని కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన గణేష్, మనోజ్, రిశ్వంత్, గోవర్ధన్, మణితేజ, రిశ్వంత్, శశిప్రి య, చైత్ర, శ్రీనిధి, నిరీష, సంజన, విశ్వేష్‌లు ఎంపికైనట్లు గ్రామ కార్యదర్శి శేఖర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పీడీ కృష్ణ ప్రసాద్‌లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శ

రాయికల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వస్తాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రొండి గంగారాం తల్లి రాజవ్వ మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, జక్కుల సాగర్, జలపతి, బొమ్మెన తిరుపతి, భూక్య నవీన్, సుధాకర్ రెడ్డి, బొడ్డు గంగాధర్, లక్ష్మణ్, చెలిమెల ముకుందం పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలకు దేవాలయం ముస్తాబు


కోరుట్లలో ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

కోరుట్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం ధనుర్మాస ఉత్సవాలకు ముస్తాబైంది. 16 నుంచి జనవరి 16 వరకు నిర్వ హించు కార్యక్రమాల సరళిని శనివారం దేవాలయ ఈవో విక్రం, ఆలయ అర్చకుడు బీర్నంది నర్సింహచారీలు ప్రటించారు. దేవాయలయంలో 16వ తేదీ నుంచి ప్రత్యేక పూజలను జరిపి నెల వారి కార్యక్రమల సరళితో పూజలను నిర్వహించనున్నారు. జనవరి 4వ తేదీన సాయంత్రం లక్షపుష్పార్చన, 7వ తేదీన సాయంత్రం సమయంలో నమ్మాళ్‌వార్ పర మపదోత్సవం, 8వ తేదీన సాయంత్రం దీపోత్సవం, 10వ తేదీన ముక్కోటి ఏకదశి, 11వ తేదీన సాయంత్రం కూడారై ఉత్సవం, 13వ తేదీన శ్రీగోదా రంగనాయకుల కల్యాణం నిర్వహించడానికి ఏర్పాట్ల ను చేస్తున్నారు. అదే విధంగా 15వ తేదీ సాయంత్రం స్వామివారి ఉంజల్ సేవ, ఏకాంత సేవ, 16వ తేదీ ఉదయం 10:30 గంటలకు చక్ర స్నానంలు నిర్వహించి ప్రత్యేక పూజలతో ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు.

మాజీ ఎంపీ పరామర్శ

కథలాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మాజీ ఎంపీపీ జవ్వాజి రేవతి భర్త గణేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం రాత్రి మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు వినోద్ కు మార్ పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకుని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ శీలం మోహన్‌రెడ్డి, గుండారపు గంగాధర్, మిట్టపల్లి గంగారెడ్డి ఉన్నారు.

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే దిష్టి బొమ్మ దహనం

కొడిమ్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అగ్రకులాల వారు బతుకమ్మ ఆడుతారని దళితులు, బహుజనులు బతుకమ్మ ఆడరని అనుచిత వ్యాఖ్యలు చేసిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దిష్టి బొమ్మను మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గ్రామస్థులు దహనం చేశారు. గ్రామ నాయకులు రాచకొండ చంద్ర మోహన్, సురుగు శ్రీనివాస్, కొత్తూరి స్వామి, రాకేష్, అంజన్‌కుమార్ ఉన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శనివారం అయునవోలు మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగాణంలో మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చన అభిషేకలు నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణరావు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి, టీజేఎస్ నాయకులు కంతి మో హన్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్, రాజేందర్ యాదవ్, మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

గొల్లపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు పశు సంపదను కాపాడుకుని అదనపు ఆదాయాన్ని ఆర్జించాలని మండల పశు వైద్యాధికారి డా. రవీందర్ పాడిరైతులకు సూచించారు. శనివారం గొల్లపల్లి మండలం గోవిందు పల్లె గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. వీఎల్‌వో మధుమోహన్, సూపర్‌వైజర్ షాదుల్లా గోపాలమిత్రలు శ్రీకాంత్, రవీందర్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మేక మృతి

మల్లాపూర్, డిసెంబరు, 14 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల కేంద్రంలో అరకంటి గంగమల్లయ్యకు సంబంధించిన మేక విద్యుత్ షాక్‌తో శనివారం మృతి చెందింది. సుమారు 20 వేల నష్టం వాటిల్లిందని వాపోయాడు.

విద్యార్థులకు బ్లాంకెట్లు పంపిణీ

పెగడపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు శనివారం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు లలిత బ్లాంకెట్లు అందజేశారు. ప్రభుత్వం విద్యార్థులకు వులెన్ బ్లాంకెట్లు సరఫరా చేయగా పాఠశాల ప్రత్యేకాధికారి మీనా క్షితో కలసి హెచ్‌ఎం లలిత పంపిణీ చేశారు.